క్లుప్తంగా

నేడు నాగసాయిబాబా మందిరం వార్షికోత్సవం

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం–పి.నైనవరం గ్రామాల మధ్య వేంచేసియున్న శ్రీనాగసాయిబాబా దీక్షా మందిరం ప్రథమ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ షేక్ లాల్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు గోపూజ, 7 గంటలకు గణపతి పూజ, 9గంటలకు అలంకారం, 10 గంటలకు లక్ష్మీగణపతి హోమం, నవగ్రహహోమం, బాబావారి మూలమంత్ర హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, బాబావారి మధ్యాహ్నహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు సమీక్ష సమావేశం

ఉయ్యూరు: పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా సమీక్ష చేయనున్నారు. ఉయ్యూరు మండలంలోని ఆకునూరు గ్రామంలో అక్కినేని కన్వెన్షన్ నందు ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యలపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఉన్నతాధికారులతో కలిసి మంత్రి రోజా నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్. విజయ్‌కుమార్ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఎమ్మెల్యే పార్థసారథి పీఏ జనార్దన్ కోరారు.

అన్నదానానికి రూ. 50 వేలు విరాళం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశవరస్వామివారి దేవస్థానంలో అన్నదానం చేయటానికి భక్తుడు రూ. 50 వేలు విరాళం ఇచ్చారు. ఆలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజయవాడకు చెందిన భక్తులు వెలగపూడి రాఘవరావు, విమలాదేవి రూ. 50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు విశేష పూజలు నిర్వహించారు. దాతల నుంచి వచ్చిన విరాళం ఆలయ బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు.

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

ఉయ్యూరు: ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక వీఆర్‌కేఎం పాఠశాల ఆడిటోరియంలో బుధవారం బైజూస్ కంటెంట్ వినియోగంపై ట్యాబ్‌లపై జిల్లా నోడల్ అధికారి పడవల శివాజీ అవగాహన కల్పించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ట్యాబ్‌ల ద్వారా బోధించే మెలకువలను నేర్పించారు. ఎంఈఓ సుధారాణి మాట్లాడుతూ డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. భవిష్యత్తు అంతా డిజిటల్ బోధనతోనే ఉంటుందని వివరించారు. శిక్షణలో పాఠశాల హెచ్‌ఎంలు, నోడల్ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన నాగమోతు భాస్కర్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను పోరంకిలో సినిమాకు వెళ్లి తిరిగి బయలుదేరి బందరు రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం అతనిని ఢీ కొట్టి వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. బాధితుడి భార్య సింధూర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

8, 11 తేదీల్లో క్రీడా జట్ల ఎంపిక

ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 11 తేదీల్లో మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జీవీ రమణ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఆటల పోటీలు తొమ్మిది అంశాల్లో జరుగుతాయన్నారు. 8న బాలురు, 11న బాలికలకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

వైభవంగా కృష్ణాష్టమి

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తమ చిన్నారులకు శ్రీకృష్ణుని వేషధారణలతో అలంకరించి మురిశారు. చిన్నారులను శ్రీకృష్ణుడి ప్రతిరూపాలుగా భావించి ఆయన లీలలు తలుచుకుంటూ పండగ జరుపుకున్నారు. తెంపల్లి, కొత్తగూడెం, చిక్కవరం, గోపవరపుగూడెం, సూరంపల్లి, ముస్తాబాద, సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బృందావన విహారి..
వందనమిదే శౌరి

- వాడవాడలా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- నేడూ కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమాలు



ఇస్కాన్ టెంపుల్‌లో స్వామికి అభిషేకం

ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలోని పాత వీబీఎం కాలేజీ ఆవరణలోని ఇస్కాన్ మందిర ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం నుంచి భక్తులు జగన్నాథ స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి కార్యక్రమంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఒకరికొకరు పోటీ పడి మరి ఉట్టి కొట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు పాల్గొన్నారు. అనంతరం మందిర నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రాధారిదాస్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షించగా, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోమాతకు చైర్మన్ రాంబాబు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం దేవస్థాన పురాణ పండితులు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా ఈవో భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న దుర్గగుడి ఈవో భ్రమరాంబ



ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలను తిలకిస్తున్న భక్తులు



ఇంద్రకీలాద్రిపై పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్‌బీకేల్లో సేవలు పారదర్శకం



గండిగుంట ఆర్‌బీకేలో ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ నిస్సీగ్రేస్

ఉయ్యూరు: ఆర్‌బీకేల ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని మండల వ్యవసాయాధికారి నిస్సీగ్రేస్ అన్నారు. మండలంలోని గండిగుంట ఆర్‌బీకే –2లో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో కలిసి ఎరువుల నిల్వలు పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఏఓ నిస్సీగ్రేస్ మాట్లాడుతూ 65.4 మెట్రిక్ టన్నుల ఎరువులను 135 మంది రైతులకు విక్రయించామన్నారు. ఎక్కడా అధిక ధరలకు అమ్మలేదని, ఆర్‌బీకే ఎరువులు బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రైవేటు వ్యక్తులకు విక్రయించటం, అవకతవకలు జరగలేదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే సిబ్బంది సేవలు అందిస్తున్నారన్నారు. సమావేశంలో పెనమలూరు నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొల్లపూడి వేణుబాబు, గండిగుంట అగ్రిబోర్డు సభ్యులు వల్లభనేని సుమన్‌కుమార్, నందం జోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సురేష్‌బాబు సేవలు అభినందనీయం



సురేష్‌బాబును సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కంకిపాడు: లయన్స్‌క్లబ్ ప్రతినిధి రావి సురేష్‌బాబు సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ విజయవాడ రూరల్ ప్రతినిధులు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్ రావిసురేష్‌బాబును బుధవారం ఘనంగా సత్కరించారు. క్లబ్ విజయవాడ రూరల్ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటుగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాలు, ఆపన్నులకు ఆర్థిక చేయూత, నిత్యావసరాలు అందజేత, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సురేష్‌బాబు జీవితం ఆదర్శనీయం అన్నారు. సురేష్‌బాబు మాట్లాడుతూ వెయ్యి మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయటం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ ప్రతినిధులు గద్దె శేషగిరిరావు, అట్లూరి సీతారామయ్య, ఆలపాటి రమేష్, సాయి ప్రసాద్, నెరుసు శివకుమార్ పాల్గొన్నారు.

నేడు రామవరప్పాడులో కృష్ణాష్టమి వేడుకలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వంతెన సెంటర్, కల్యాణి టెంట్ హౌస్ ఆవరణలో గురువారం శ్రీ రాధాకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు పులి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతోమాట్లాడుతూ ఈ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించిన మాదిరిగానే ఈ ఏడాది కూడా గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి పర్యవేక్షణలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9గంటలకు పూజా కార్యక్రమాలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

రామవరప్పాడు వేమినేని రామస్వామి వీధిలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు కొంగన రవి తెలిపారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు శ్రీ కృష్ణుని పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 10 గంటలకు గోపూజ, 10.30 గంటలకు హరేకృష్ణ సంకీర్తన, ముఖ్య అతిథుల ఆహ్వానం, 11.30 గంటలకు ప్రసాద వితరణ, సాయంత్రం ఐదు గంటలకు ఉట్టి కొట్టుట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేశ మనుగడకు దిక్సూచి భగవద్గీత



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య

జుఝవరం(పామర్రు): భగవత్ గీత, మహాభారతాలు మన దేశ మనుగడకు దిక్సూచి వంటివని ప్రముఖ గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య అన్నారు. మండలంలోని జుఝవరం గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ యాదవ్ భక్త బృందం, పామర్రు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణ వేదిక వద్ద కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ అంతరించిపోతున్న ఆధ్యాత్మికతకు జీవం పోసే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి ఆదరించాలని కోరారు. అనంతరం ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కళారత్న వేదాంతం రాధేశ్యామ్ మహాభారతంలోని కృష్ణ యక్ష గానాన్ని ఆలపిస్తూ శ్రీకృష్ణ బోధనను నాట్య రూపకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు, గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, శ్రీకృష్ణ కమిటీ కన్వీనర్ జొన్నలగడ్డ నాగరాజు, కళా పరిషత్ డైరెక్టర్ పామర్తి వెంకట నారాయణ, కొల్లా శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, తుంగల వేణు, గోపాల ప్రసాద్, సోమవరపు రామారావు, పోతురాజు పాల్గొన్నారు.

14న వాహనాలకు బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు సీతారామపురం సిగ్నల్ వద్ద ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తామన్నారు. మూడు టూ వీలర్ వాహనాలకు వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనదలచిన ఔత్సాహికులు రూ.5 వేలు ధరవత్తు చెల్లించాలని చెప్పారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించి వాహనాలు స్వాధీనం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94409 02455, 99595 10446 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వృద్ధుడికి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.7,500 సాయంగా అందజేసింది. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన కొండపల్లి సత్యనారాయణరెడ్డి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మానవత సంస్థను ఆశ్రయించారు. దీంతో స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో బుధవారం ఆయనకు రూ.7,500 సభ్యులు అందజేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వడ్డీ రాజేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, క్లోపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఉంగుటూరు: ఇందుపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం అయింది. పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ. 2కోట్లుతో 95శాతం పనులు పూర్తి చేసినప్పటికి నిధుల కొరతతో కొన్ని పనులు మిగిలిపోయాయి. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీపీ, ఎంపీడీఓ చర్చించి మండల పరిషత్ నిధులతో పనులు పూర్తి చేయాలని సూచించారు. దీంతో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలు మంజూరు చేశారు. పీహెచ్‌సీకి వేళ్లే అంతర్గత రహదారి నిర్మాణం, మెరక, జంగిల్ క్లియరెన్స్ పనులు ఎంపీపీ వి.సరోజిని గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి అడ్డంకి పనులు తొలగించి పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే వంశీ, ఎంపీపీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నున్న చినకంచిలో వేదపారాయణ



వేదపారాయణం చదువుతున్న పండితులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆలయంలో బుధవారం సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణ చేశారు. వర్షరుతువు సందర్భంగా వర్షాలు పుష్కలంగా కురిసి శుభిక్షంగా ఉండాలని కోరుతూ పారాయణ చేశారు. చిట్టి శ్రీనివాసమూర్తి, లీలా దంపతులు కార్యక్రమాన్ని నిర్వహించగా, పది మంది వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో ప్రకృతి వ్యవసాయం



విత్తనాలు నాటుతున్న రైతులు

వేములమడ(మొవ్వ): ఏటీఎం విధానం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తూ నాణ్యమైన మంచి పోషకాలు కలిగిన కాయగూరలు, ఆకుకూరలు సాగు చేసే ఏటీఎం విధానానికి మొవ్వ మండలం వేములమడలో రైతులు శ్రీకారం చుట్టారు. ప్రకృతి వ్యవసాయం మెంటర్ గొంగి పోతలయ్య పర్యవేక్షణలో బుధవారం 20 సెంట్ల భూమిలో ఏటీఎం పద్ధతి ద్వారా ఆకు కూర, కూరగాయలు, తీగ జాతి, దుంప జాతి నిరంతరం ఆదాయం వచ్చే విత్తనాలను రైతులు నాటారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు, ఫార్మర్ సైంటిస్ట్‌లు, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం



పోరంకిలో జలమయమైన జాతీయ రహదారి

వాహనదారులకు తప్పని పాట్లు

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాధారణంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. రైతులు కూడా ఊపిరిపీల్చుకున్నారు. అయితే భారీ వర్షం కారణంగా విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి భారీగా వర్షం నీటితో జలమయమైంది. రోడ్లపై మోకాలిలోతు నీరు నిలిచిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారికి ఇరుపక్కల డ్రెయినేజీలు లేక పోవటంతో వర్షం కురిసిన సమయాల్లో జాతీయ రహదారి పై భారీగా నీరు నిలిచిపోతోంది. మండల పరిధిలో పోరంకి, కామయ్యతోపు, కానూరు ప్రాంతాల్లో జాతీయ రహదారి వర్షం కారణంగా మునిగిపోయింది. వర్షం తగ్గిన తర్వాత కూడా రోడ్డుపై నీరు చాలా సమయం నిలిచిపోయింది. రోడ్డుపై నీరు ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు.



గండిగుంట బైపాస్ సర్వీసు రోడ్డులో నిలిచిన వర్షపునీరు

కుండపోత వర్షం..

కంకిపాడు/ఉయ్యూరు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో కుండపోత వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆకాశం పూర్తిగా మేఘావృతమై భారీ వర్షం కురిసింది. వర్షానికి ఉరుములు, మెరుపులు తోడయ్యాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవటంతో రాకపోకలు సజావుగా సాగక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గండిగుంట సర్వీసు రోడ్డు, కంకిపాడు, పునాదిపాడు సర్వీసు రోడ్లు జలమయంగా మారటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బస్టాండు ప్రాంగణం చెరువును తలపించింది. వాతావరణం చల్లపడటంతో ఉక్కపోత, ఎండ వేడిమి వాతావరణం నుంచి ప్రజలు ఊరట చెందారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కోరుతూ వినతి



ఎమ్మెల్యే వంశీమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

గన్నవరం: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలియజేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కలపాల వికాస్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వికాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్గకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం ద్వారా మాదిగ యువతకు విద్య, ఉద్యోగ పరంగా మేలు జరుగుతుందన్నారు. ఆ సంఘ నేతలు పేటేటి కిషోర్‌కుమార్, ఐనంపూడి ఆశీర్వాదం, రవి, వినోద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



పెనమలూరు ఉపాధ్యాయుడు పిచ్చేశ్వరరావును సన్మానిస్తున్న కలెక్టర్ రాజాబాబు



ఉపాధ్యాయురాలు కాత్యాయనీని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కంకిపాడు: లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు, కంకిపాడు మధు వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కంకిపాడులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చాటుతున్న ఉపాధ్యాయులను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా ఉత్తమమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కేఎస్ మల్లేశ్వరరావు, మద్దుల త్రివిక్రమరావు, ఎం. గోవిందరావు, శంకర్‌గుప్తా, ఎంఈఓ కే.ప్రసాద్, న్యాయవాది బండి జ్యోతి, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెనమలూరు ఉపాధ్యాయుడికి ఉత్తమ ప్రతిభా పురస్కారం

పెనమలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు కల్లేపల్లి పిచ్చేశ్వరరావుకు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రతిభా పురస్కారం అవార్డు వచ్చింది. ఈ మేరకు కలెక్టర్ రాజాబాబు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయుడు పిచ్చేశ్వరరావుకు అవార్డు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రాజెక్టులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో పిచ్చేశ్వరరావుకు అవార్డు వచ్చింది. కాగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చిన పిచ్చేశ్వరరావును పెనమలూరులో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నేడు శ్రీకృష్ణ భగవానుని శోభాయాత్ర

గుడివాడటౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని కృష్ణమందిరంలో బుధవారం సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటలకు కృష్ణాష్టమి పూజా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 9 గంటలకు కృష్ణ మందిరం నుంచి గుర్రాల రథంపై శ్రీకృష్ణభగవానుని పట్టణ పురవీధులలో ఊరేగిస్తారన్నారు. శోభాయాత్రలో భాగంగా గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం, కర్రసాము తదితర కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. గుడివాడ పరిసర ప్రాంత భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారం నరసింహరావు, మెరుగుమాల కాళీ, లోయ రాజేష్, గోపర్తి మురళి, సతీష్, దారం ఏడుకొండలు, ఆర్‌పీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

9న ఉచిత మెగా వైద్య శిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆటోనగర్ గేట్ వంద అడుగుల రోడ్డులోని చర్చి ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. గత 8 సంవత్సరాలుగా నిరుపేదలకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం జరగబోయే క్యాంపుకు సుమారుగా రూ.1.50 లక్షలు విలువ చేసే మందులను ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఈ క్యాంపులో బీపీ, సుగర్, ఈసీజీ, థైరాయిడ్, బీఎండీ, ఆర్‌బీఎస్, ఆడియోమెట్రీ, 2డీ ఈకో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.